
కొబ్బరి చెట్లపై పిడుగులు

వజ్రపుకొత్తూరు, మే 19(ఆంధ్రజ్యోతి): వజ్రపుకొత్తూరు మండలం కొమరల్తాడ పంచాయతీ తామాడవానిపేటలో సోమవారం రెండు ప్రాంతాల్లో కొబ్బరిచెట్లపై పిడుగులు పడ్డాయి. కొబ్బరిచెట్లు కాలిపోయాయని బాధితుడు చింత మహేష్ తెలిపారు. పిడుగుధాటికి కొంతమంది ఇంట్లో ఉన్న గృహోపకరణాలు ధ్వంసమయ్యాయన్నారు. సుంకర జగన్నాథపురంలో ఫెన్సింగ్ ఫ్యాక్టరీలోని మిషనరీ దెబ్బతిన్నట్లు బాధితుడు అఖిల్ తెలిపారు.



- ఒక్కో టీచర్ పోస్టుకు 71 మంది పోటీ
- ఉమ్మడి జిల్లాలో 543 ఉపాధ్యాయ ఖాళీలు
- 22,648 మంది అభ్యర్థులు.. 39,235 దరఖాస్తులు
- పురుషుల కంటే 3,342 మంది మహిళలు అధికం

ఢీ.. ఎస్సీ



శ్రీకాకుళం గ్రంథాలయంలో చదువుకుంటున్న యువత

నరసన్నపేట, మే 19(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ కొలువుకుగానూ అభ్యర్థుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. గత వైసీపీ ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించక పోవడంతో అభ్యర్థులు ఉపాధ్యాయ పోస్టుల కోసం ఇన్నాళ్లూ ఎదురుచూశారు. ప్రస్తుత ప్రభుత్వం ఇటీవల నోటిఫికేషన్ జారీ చేయగా.. ఉపాధ్యాయ పోస్టుల నియామ కానికి ఈ నెల 15తో దరఖాస్తుల ప్రక్రియ ముగిసింది. కాగా ఉమ్మడి జిల్లాలో ఒక్కో పోస్టుకు సగటున 71 మంది పోటీ పడుతు న్నారు. ఉమ్మడి జిల్లాలో అన్ని కేటగిరీలు కలిపి 543 ఉపాధ్యాయ పోస్టులకు రాష్ట్ర ప్రభుత్వం గతనెల 20న నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రభుత్వ యాజమాన్యం, జిల్లా, మండల పరిషత్ యాజమాన్యంలో అన్ని పాఠశాలల్లో 458 పోస్టులు, గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో 85 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మొత్తంగా 543 పోస్టులకు సంబంధించి 22,648 మంది అభ్యర్థులు.. 39,235 దరఖాస్తులు చేశారు. చాలామంది మంది రెండు అంతకంటే ఎక్కువ పోస్టులకు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుదారుల్లో పురుషులు 9,653 మంది, మహిళలు 12,995 మంది ఉన్నారు. పురుషుల కంటే 3,342 మంది మహిళా అభ్యర్థులే అధికం. రిజర్వేషన్ కేటగిరీల వారీగా పరిశీలిస్తే బీసీ-డీ నుంచి అత్యధికంగా 7,281 మంది దరఖాస్తు చేసుకోగా, బీసీ-సీ నుంచి కేవలం 35 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఎటువంటి రిజర్వేషన్ లేనివారు 653 మంది, బీసీ-ఏ 5,210 మంది, బీసీ- బీ 2,737 మంది, బీసీ-ఈ నుంచి 107 మంది దరఖాస్తు చేశారు. ఇక ఎస్సీ వర్గీకరణ అమలు తరువాత ఈ డీఎస్సీలో ఎస్సీ కేటగిరీ విభాగాల్లో పరిశీలిస్తే.. ఎస్సీ కేటగిరీ -1లో 516 మంది, కేటగిరీ -2 నుంచి 666 మంది, కేటగిరీ -3 నుంచి 3,066 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఎస్టీ విభాగం నుంచి 2,377 మంది, ఈడబ్ల్యూఎస్ నుంచి 408 మంది, దివ్యాంగుల విభాగంలో దృష్టిలోపం ఉన్నవారు 128 మంది, వినికిడి లోపం ఉన్నవారు 32 మంది, శారీరక వైకల్యం ఉన్నవారు 441 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన కొంతమంది అభ్యర్థులు.. కర్నూలు, విశాఖపట్నం, ఉభయగోదావరితోపాటు పలు జిల్లాల్లో కూడా పరీక్షలు రాసేందుకు దరఖాస్తు చేసుకున్నారు. పోటీ తీవ్రంగా ఉన్న నేపథ్యంలో అభ్యర్థులు మరింత ప్రణాళికతో సిద్ధమవ్వాలని నిపుణులు సూచిస్తున్నారు. జూన్ 6 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో అభ్యర్థులు.. ఎలాగైనా కొలువు సాధించాలనే లక్ష్యంతో పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు.

నిర్ణీత సమయంలో అర్జీలు పరిష్కరించాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 19(ఆంధ్రజ్యోతి): అర్జీలు పెండింగ్‌లో లేకుండా నిర్ణీత సమయంలో పరిష్కరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. సోమవారం జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన 'మీ-కోసం' కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ 75 మంది అర్జీలను సమర్పించారు. వివాదాలకు తావులేకుండా.. అర్జీదారులు సంతృప్తి చెందేలా ఆ వినతులు సకాలంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

గాలీవాన, పిడుగుల ముప్పుపై వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. సోమవారం జడ్పీ కార్యాలయంలో జిల్లా అధికారులతో ఆయన సమావేశమ య్యారు. 'పిడుగుపాటు సమాచారం అందిన వెంటనే గ్రామస్థాయిలో ప్రజలను అప్రమత్తం చేయాలి. వ్యవసాయ, పశుసంపద, తోటలు, చెట్లు పడిపోవడం, విద్యుత్తు లైన్లు దెబ్బతినడం వంటి సమాచారంపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలి. వాతావరణ హెచ్చరికలు వచ్చిన వెంటనే సంబంధిత గ్రామాల్లో దండోరా వేయించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి' అని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో వేంకటేశ్వరరావు, ఉప కలెక్టర్ పద్మావతి, జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

గ్రీవెన్స్‌లో సొమ్మసిల్లిన వృద్ధురాలు



సొమ్మసిల్లిన మంగమ్మకు సపర్యలు చేస్తున్న వైద్య సిబ్బంది

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 19(ఆంధ్రజ్యోతి): జడ్పీ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన 'మీ-కోసం'(గ్రీవెన్స్) కార్యక్రమంలో శ్రీకాకుళం నగరానికి చెందిన లొట్టి మంగమ్మ అనే వృద్ధురాలు సొమ్మసిల్లి పడిపోయింది. అక్కడే ఉన్న వైద్య సిబ్బంది వెంటనే మంగమ్మకు ప్రథమ చికిత్స చేసి, ఓఆర్ఎస్ తాగించారు. ఉదయం నుంచి ఆహారం తీసుకోలేదని, అందుకే కళ్లుతిరిగి పడిపోయినట్లు మంగమ్మ తెలిపింది. దీంతో బిస్కెట్లు, పులిహోరను ఆమెకు వైద్యసిబ్బంది ఆహారంగా అందించడంతో కోలుకుని వెళ్లిపోయింది. కాగా, ఈ నెల 5న గ్రీవెన్స్‌లో ఈమె తన ఆస్తి తగాదాను పరిష్కరించాలని కోరుతూ ఒంటిపై పెట్రోలు పోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించింది.

మొర వింటూనే.. ఫిర్యాదు రాసిస్తూ..

- పోలీసు వ్యవస్థలో సమూలమైన మార్పులకు శ్రీకారం
- ఇక ఏఐ ద్వారా సేవల వినియోగానికి చర్యలు



ఏఐ సాంకేతికతను వినియోగిస్తున్న పోలీసుల ఊహాచిత్రం

పలాస, మే 19(ఆంధ్రజ్యోతి): పోలీసు వ్యవస్థలో ప్రయోగాత్మకంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా సమర్థవంతమైన, పారదర్శక సేవలు అందించాలని నిర్ణయించింది. ఇప్పటికే ఈ వ్యవస్థ ద్వారా నిర్వహించిన ట్రయల్ రన్ విజయవంతం కాగా.. రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా 175 పోలీసుస్టేషన్లలో అమలు చేయడానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఏఐ ప్రత్యేకత ఏంటంటే.. బాధితుల మొర వింటూనే ఫిర్యాదును రాసి ఇచ్చేస్తుంది. నేరాన్ని బట్టి ఎఫ్ఐఆర్‌లో చేర్చాల్సిన సెక్షన్లు ఇట్టే చెప్పేస్తుంది. నేరం జరిగిన ప్రదేశంలో ఆధారాల సేకరణ నుంచి దర్యాప్తు దారి చెప్పడంతో పాటు డిఫెన్స్ లాయర్ ఏమి వాదిస్తారో చెబుతూనే కౌంటర్ కూడా సూచిస్తుంది. బాధితుడి ఫిర్యాదు నుంచి కోర్టులో చార్జిషీట్ వరకూ అంతా ఏఐతోనే నిర్వహించాలనే సంకల్పంతో ప్రభుత్వం ఉంది. మొదటిగా పోలీసుశాఖ నుంచే దీన్ని అమలు చేస్తున్నారు. ప్రస్తుతం ఏలూరు జిల్లాలో ఒక పోలీస్‌స్టేషన్‌లో ట్రయల్ రన్ నిర్వహిస్తుండగా.. మంచి ఫలితాలు ఇస్తున్నాయి. జిల్లాలో కూడా దీన్ని అమలు చేయడానికి (మిగతా 6వ పేజీలో..)

ఏపీ ఈఏపీ సెట్ ప్రారంభం

ఎచ్చెర్ల/నరసన్నపేట, మే 19(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశం కోసం ఏపీ ఈఏపీ సెట్-2025 సోమవారం ప్రశాంతంగా ప్రారంభమైంది. జేఎన్‌టీయూ (కాకినాడ) పర్యవేక్షణలో టీసీఎస్ సాంకేతిక సాయంతో జిల్లాలోని శ్రీ శివానీ ఇంజనీరింగ్ కళాశాల(చిలకపాలెం), శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల (ఎచ్చెర్ల), కోర్ టెక్నాలజీ (నరసన్నపేట), ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంటు (టెక్కలి)లో ఆన్‌లైన్ విధానంలో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. సోమవారం రెండు షిఫ్ట్‌ల్లో కలిపి శ్రీ శివానీ కళాశాలలో 560 మందికి 524మంది హాజరయ్యారు. శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో 342 మందికి 312 మంది హాజరయ్యారు. ఈ నెల 27వ తేదీ వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. 19, 20 తేదీల్లో బైపీసీ స్ట్రీమ్‌లో ఫార్మసీ, అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశానికి సెట్ నిర్వహించనున్నారు.



ఎచ్చెర్ల: హాల్‌టిక్కెట్లు పరిశీలన..



నరసన్నపేట: పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థులు

గ్రానైట్ క్వారీల తనిఖీ

- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని అధికారుల హెచ్చరిక

8లో

తీరం.. అభివృద్ధికి దూరం

- ఇదీ శివసాగర్ బీచ్ దుస్థితి
- పర్యాటకులకు సౌకర్యాలు కరువు

6లో

సెలవుల్లో జాగ్రత్త

- పిల్లలపై ఓ కన్నేయండి
- ఆటపాటలపైనా దృష్టి పెట్టండి
- ప్రమాదాల నుంచి కాపాడండి

6లో

దిగుబడి లేక.. ధర రాక



అమ్మకానికి సిద్ధంగా ఉన్న టమాటాలు

- టమాటా పంటకు తెగుళ్ల బెడద
- పతనమైన రేట్లతో రైతులకు నష్టాలు

సోంపేట, మే 19 (ఆంధ్రజ్యోతి): టమాటా ధరలు తగ్గుముఖం పట్టడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సోంపేట మండలంలో వరి తర్వాత అధికంగా టమాటా పండిస్తారు. బీలకు ఆనుకుని ఉన్న బెంకిలి, జింకిభద్ర, లక్కవరం, పలాసపురం, బారువ, కుత్తమ, మండపల్లి, అమ్మవారిపుట్టుగ తదితర గ్రామాల్లో సుమారు 1000 ఎకరాల్లో టమాటా సాగు చేశారు. గతంలో టమాటా పండిస్తే రైతులకు లాభం వచ్చేది. ఈ ఏడాది మాత్రం ధరలు తగ్గడంతో కన్నీరు తెప్పిస్తోంది. గతంలో 27 కిలోల ట్రే రూ.300 నుంచి రూ.500 పలికేది. ప్రస్తుత ధర రూ.100 మాత్రమే ఉందని రైతులు వాపోతున్నారు. ఒకవైపు ధర పతనం కాగా.. మరోవైపు తెగుళ్ల బెడదతో దిగుబడి గణనీయంగా తగ్గిపోయిందని పేర్కొంటున్నారు. గతంలో ఎకరాకు 20టన్నుల వరకు దిగుబడి రాగా.. ప్రస్తుతం రెండు టన్నులు కూడా రావడం లేదని వాపోతున్నారు. టమాటా సాగుకు ఎకరాకు రూ.50 వేల వరకు ఖర్చుకాగా.. ప్రస్తుతం గిట్టుబాటు ధర రాక అప్పులపాలవుతున్నామని ఆవేదన చెందుతున్నారు.

నష్టమే మిగులుతోంది..



టమాటా పండించే రైతులకు గతంలో గిట్టుబాటు ధర లభించేది. ఒక్కో కిలో రూ.15 వరకు విక్రయించేవాళ్లం. ప్రస్తుతం కిలో రూ.3మాత్రమే పలుకుతోంది. దీంతో రైతులకు నష్టమే మిగులుతోంది. కనీసం పెట్టుబడి కూడా రావడం గగనం అవుతోంది.

-పోకల హేమరాజు, జింకిభద్ర

తగ్గిన దిగుబడి..



టమాటా రైతులకు కష్టాలు తప్పడంలేదు. ఒకవైపు ధరలు తగ్గగా.. మరోవైపు తెగుళ్లు బాధిస్తున్నాయి. ఎకరాకు 20 టన్నుల వరకు పండే టమాటా.. ప్రస్తుతం తెగుళ్లబారిన పడి 3 టన్నుల దిగుబడికూడా రావడం లేదు. పెట్టుబడి వ్యయం పెరిగి.. దిగుబడి తగ్గడంతో నష్టాలు ఎదుర్కోవాల్సి వస్తోంది.

-సించాల పాడీ, బెంకిలి

తల్లిదండ్రుల కళ్ల ముందే..

- ఆరేళ్ల బాలుడు మృతి
- రోడ్డు దాటుతుండగా.. ఢీకొన్న ద్విచక్ర వాహనం
- ఎరుకలపేట కూడలి వద్ద ప్రమాదం



యువంత్ (ఫైల్)



యువంత్ మృతదేహం

పొందూరు, మే 19(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు కావడంతో ఆ ఆరేళ్ల బాలుడు.. తల్లిదండ్రులతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లాడు. వారితో ఒకరోజు సరదాగా ఆడుతూ పాడుతూ గడిపాడు. మరుసటి రోజు సాయంత్రం తిరిగి తన ఇంటికి ఆటోలో వెళ్లేందుకుగానూ తల్లిదండ్రులతో కలిసి రోడ్డుకు చేరుకున్నాడు. తండ్రి రోడ్డును దాటి అవతలివైపు వెళ్లగా.. అప్పటి వరకూ అమ్మ చేయి పట్టుకున్న ఆ బాలుడు కూడా రోడ్డు దాటే ప్రయత్నం చేశాడు. తల్లిదండ్రులు వద్దని వారించినా వినిపించుకోకుండా రోడ్డు దాటుతుండగా.. ఘోరం జరిగిపోయింది. ద్విచక్ర వాహనం బలంగా ఢీకొనడంతో ఆ బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. కళ్ల ముందే రక్తపు మడుగులో ఉన్న కుమారుడిని చూసి తల్లిదండ్రులు కుప్పకూలిపోయారు. స్థానికులు వెంటనే సపర్యలు చేసి.. ఆ బాలుడిని ఆస్పత్రికి తరలించగా.. చికిత్స అందించేలోపు మృతి చెందాడు. కుటుంబ సభ్యులకు తీరని విషాదాన్ని మిగిల్చాడు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

- పొందూరు మండలం ఎరుకలపేట కూడలివద్ద సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో పేడాడ యువంత్ అనే ఆరేళ్ల బాలుడు మృతి చెందాడు. యువంత్‌ది పొందూరు మండలం గోకర్ణపల్లిపేట పంచాయతీ రంగనాథపేట. స్థానిక పాఠశాలలో ఒకటో తరగతి చదివాడు. ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో ఆదివారం తల్లిదండ్రులు హరిబాబు, ఈశ్వరమ్మతో కలిసి ఎరుకలపేటలో ఉన్న తన చినతాత ఇంటికి వెళ్లాడు. ఆదివారం కుటుంబ సభ్యులు, బంధువులతో సరదాగా గడిపాడు. సోమవారం సాయంత్రం ఆ ముగ్గురూ తిరుగుపయనానికి సిద్ధమయ్యారు. ఈ క్రమంలో ఆటో కోసం ఎరుకులపేట కూడలి వద్దకు చేరుకున్నారు. తండ్రి హరిబాబు రోడ్డు నుంచి అవతలి వైపునకు వెళ్లాడు. తల్లి చేతిని విడిపించుకుని యువంత్ కూడా తండ్రి వద్దకు వెళ్లాలనే ఆతృతతో రోడ్డు దాటాలని ప్రయత్నించాడు. తల్లిదండ్రులు వద్దని చెప్పినా.. రోడ్డు దాటుతుండగా, అదే సమయంలో చిలకపాలెం నుంచి పొందూరువైపు వస్తున్న ద్విచక్రవాహనం ఆ బాలుడిని బలంగా ఢీకొట్టింది. దీంతో యువంత్ అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. రక్తపు మడుగులో ఉన్న కుమారుడిని చూసి తల్లిదండ్రులు ఆందోళన (మిగతా 6వ పేజీలో..)

సెలవుల్లో జాగ్రత్త

విజయనగరం మండలం ద్వారపూడి గ్రామానికి చెందిన మనస్వి, మంగి ఉదయ్, బూర్లి జాస్విత, చారుమతిలు ఆదివారం కారు లోపల చిక్కుకొని... డోర్ లాక్ పడడంతో ఊపిరాడక చనిపోయారు. దీంతో ఆ కుటుంబాలు తీవ్ర విషాదంలో కూరుకుపోయాయి. ఈ సంఘటన పిల్లల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తోంది.

- పిల్లలపై ఓ కన్నేయండి
- ఆటపాటలపైనా దృష్టి పెట్టండి
- ప్రమాదాల నుంచి కాపాడండి



నరసన్నపేట, మే 19 (ఆంధ్రజ్యోతి)

పిల్లలకు అతిపెద్ద పండుగ వేసవి సెలవులే. ఈ సమయంలో వారి ఆనందానికి పట్టపగ్గాలుండవు. సైకిళ్ల పందాలు, ఈత పోటీలు, దాగుడుమూతలు... ఇలాంటివి బోలెడు ఆటలు ఆడుతుంటారు. సెలవులు శారీరంగానేగాక మానసిక వికాసానికి... ఉత్తేజానికి... సృజనాత్మకతకు బాగా దోహదపడతాయి. వీటి మాటున పిల్లలు ప్రమాదాలు తెచ్చుకునే పరిస్థితులూ పొంచి ఉన్నాయి. తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు తమ పిల్లలపై ఓ కన్నేసి ఉంచాల్సిన అవసరాన్ని ఇవి గుర్తు చేస్తున్నాయి.



బహుళ అంతస్తులలో భద్రం..

బహుళ అంతస్తుల్లో నివసించే వారు తమ పిల్లల పట్ల జాగ్రత్తలు వహించాలి. అపార్ట్‌మెంట్ పార్కింగ్‌లో ఎన్నో కార్లు నిలిచి ఉంటాయి. ఉదాహరణకు దాగుడు మూతలు ఆడుతుంటారు. ఎవరికీ కనిపించకుండా ఉండాలన్న ఆతృతలో కారు డిక్కీలు, కార్లలో, వాటి కింద, అపార్ట్‌మెంట్ సన్‌షేడ్‌లలో దాక్కోవడం వంటివి పిల్లలు తరచూ చేస్తుంటారు. కారు డిక్కీ లాక్ అయితే ఊపిరాడక ప్రాణాల మీదకు వచ్చే ప్రమాదం ఉంది. సన్‌షేడ్‌లపై దాక్కోవడం వల్ల జారిపోయి... కింద పడేందుకు ఆస్కారం ఉంది. ఆటల్లో నిమగ్నమైన పిల్లలు పైఅంతస్తులకు వెళ్లేందుకు వేగంగా పరుగెడుతుంటారు. అటువంటి సమయంలో పట్టుతప్పి కింద పడిపోవచ్చు. వీటిని దృష్టిలో ఉంచుకుని పిల్లలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

గ్రామీణ ప్రాంతాల్లో..

గ్రామీణ ప్రాంతాల్లో చాలా ఇళ్లలో కుటుంబ పోషణ నిమిత్తం భార్యాభర్తలిద్దరూ పనికి వెళుతుంటారు. పిల్లలను ఇళ్ల వద్దనే వదిలి వెళ్లాల్సిన పరిస్థితి ఉంటుంది. ఆ సమయంలోనే పిల్లలు చెరువులు, కాలువలు, బావుల వద్దకు సరదాగా ఈతకంటూ బయలుదేరుతారు. ఒక్కోసారి తెలియకుండానే లోతుకు వెళ్లి శ్వాస అందక ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు కోకొల్లలు. గ్రామీణ ప్రాంత తల్లిదండ్రులు ఈ విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలి. పనికి వెళ్లే సమయంలో తెలిసిన వారి వద్ద తమ చిన్నారులను ఉంచి వెళ్లడం మంచిది.



తల్లిదండ్రులు ఇలా చేస్తే మేలు..

- వేసవి నేపథ్యంలో వడగాలుల ప్రభావం రోజురోజుకూ ఎక్కువ అవుతోంది. సాధ్య మైనంత వరకూ పిల్లలను ఇంట్లోనే ఉంచేందుకు ప్రయత్నించాలి. లేదంటే వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంది.
- ఆటలాడుకునే ఆసక్తి ఉన్న పిల్లలను క్యారమ్స్, చెస్ లాంటివి తెచ్చి ఇంట్లోనే ఆడుకునేలా ప్రోత్సహించాలి. చదరంగం వంటి క్రీడలు ఆడటం వల్ల పిల్లల మేధస్సు వికసిస్తుంది. క్యారమ్స్ వల్ల లక్ష్య సాధనపై గురి కుదురుతుంది అనే సత్యాలను పిల్లలకు తెలియజేయాలి.
- విద్యార్థులను గ్రంథాలయాలకు పంపి... పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందించాలి. మహనీయుల కథలు, చరిత్ర పుస్తకాలు, బొమ్మల పుస్తకాలు, చందమామ, బాలమిత్ర కథలు వంటివి చదువుకునేలా వారిని సిద్ధం చేయాలి. వాటిలో మంచీ చెడులను, న్యాయాన్యాయాలను, ధర్మాధర్మాల గురించి తెలపాలి. నీతి కథలను చదివించి వాటిలో నీతిని అడిగి తెలుసుకోవాలి.
- ఏ వయస్సు వారికైనా ఉదయం నడక, వ్యాయామం శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. తల్లిదండ్రులు శ్రమ అనుకోకుండా పిల్లలను రోజూ మైదానానికి వెంటబెట్టుకుని తీసుకెళ్లాలి. కొద్దిసేపు నడిపించడం... పరుగెత్తించడం, వారికి నచ్చిన ఆటలు ఆడించడం లాంటివి చేయాలి. అయితే వారిని దగ్గరుండి పర్యవేక్షించాలి.
- స్నేహితుల ఇళ్లకు వెళతామని పిల్లలు మారాం చేయడం సహజం. ఒకవేళ తప్పదనుకుంటే.. తల్లిదండ్రులే వారిని వెంటబెట్టుకుని వెళ్లి వారి స్నేహితుల ఇళ్లలో దిగబెట్టి రావాలి. అంతేకాకుండా ఆ ఇంట్లో పెద్ద వారికి తగిన జాగ్రత్తలు చెప్పడం వల్ల వారు పిల్లలపై ఓ కన్నేసి ఉండేందుకు అవకాశం ఉంది.

వాహనాలకు దూరంగా ఉంచాలి...

చాలా మంది విద్యార్థులు ద్విచక్ర వాహనాలను నడిపేందుకు ఉవిళ్లూరుతుంటారు. కొంతమంది బైక్‌లపై రివ్వున దూసుకుపోతారు. ఇలా ఒక్కోసారి ప్రాణాల మీదకు తెచ్చుకుంటారు. 18 ఏళ్ల నిండని పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదు. కొందరు అత్యుత్సాహంతో తల్లిదండ్రులు నిద్రపోతున్న సమయాల్లో, తెల్లవారుఝామున, రాత్రి వేళల్లో బైక్‌ల తాళాలు తీసుకుని చక్కర్లు కొడతారు. వీటిని దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులు ఎట్టి పరిస్థితుల్లోనూ పిల్లలకు బైక్ తాళాలు అందనివ్వకూడదు. పిల్లలు నిరుత్సాహానికి గురైనా కోపం తెచ్చుకోకుండా వారికి అర్థమయ్యే రీతిలో సర్దిచెప్పేందుకు ప్రయత్నించాలి.

పర్యవేక్షణ అవసరం..



తల్లిదండ్రులు లేదా కుటుంబ సభ్యులు పిల్లలను ఒంటరిగా వదలకూడదు. వారికి ఏది మంచి .. ఏది చెడు అనే జ్ఞానం ఉండదు. శారీరకంగా ఎదుగుదలకు, మానసిక ఆరోగ్యానికి ఆటలాడడం మంచిదే. పెద్దల పర్యవేక్షణ ఉండాలి. అలాగే నీతి కథలు, మానసిక వికాసం కలిగించే ఆటలను ఎక్కువగా ఇంట్లో ఆడించాలి.

-డాక్టర్ పొన్నాడ గణేష్, సూపరింటెండెంట్, సామాజిక ఆసుపత్రి, కోటబొమ్మాళి

అవగాహన కల్పించాలి



7 నుండి 14 ఏళ్ల మధ్య పిల్లలకు ఆటలంటే ఎంతో ఇష్టం. ఇంట్లో ఉండడం కంటే బయటకు వెళ్లేందుకు ఇష్టపడతారు. వారికి నెమ్మదిగా కౌన్సెలింగ్ చేయాలి. ఏ ఆటలు ఆడితే ఏ ప్రమాదం వస్తుందో తెలియజేయాలి. మగపిల్లలు ఎక్కువగా నేలబావులు, చెరువులకు వెళ్లేందుకు మక్కువ చూపిస్తారు. ఇది చాలా ప్రమాదం. వీటిని నివారించాలి.

-కె.లత, ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల



చినదోకులపాడులో ఆకట్టుకున్న నవదుర్గా వేషాలు

ఘనంగా గ్రామదేవత ఉత్సవాలు

వజ్రపుకొత్తూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): చినదోకులపాడులో గ్రామదేవత ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మూడు రోజులు పాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు గ్రామస్తులు చెప్పారు. ఆదివారం గ్రామదేవత పెద్దమ్మతల్లిని మేళతాళాలతో ఊరిలోకి ఆహ్వానించారు. ఉత్సవాలలో భాగంగా సోమవారం ఏర్పాటు చేసిన పగటి వేషాలు ఆకట్టుకున్నాయి. మంగళవారం సిరిమాను ఉత్సవంతో కార్యక్రమాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

భక్తులతో శ్రీముఖలింగం కిటకిట

జలుమూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగేశ్వర స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. వైశాఖ మాసం 4వ సోమవారం పర్వదినం కావడంతో స్వామి దర్శనార్థం భక్తులు బారులు తీరారు. పరిసర గ్రామాలతో పాటు జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు చేరుకోవడంతో శ్రీముఖలింగం కిటకిటలాడింది. స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ ఈవో పి.ప్రభాకరరావు పర్యవేక్షించారు. ఆలయ ప్రాంగణంలో తాగునీటి సౌకర్యం కల్పించారు. దర్శనానికి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

తల్లిదండ్రుల కళ్ల ముందే..

(ఐదో పేజీ తరువాయి)

చెందారు. స్థానికుల సహాయంతో వెంటనే పొందూరు ప్రభుత్వ ఆస్పత్రికి యువంత్‌ను తరలించారు. అక్కడ వైద్యులు లేకపోవడంతో శ్రీకాకుళంలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(రిమ్స్)కు తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. అక్కడికి తరలించి చికిత్స అందించేలోగా యువంత్ మృతి చెందాడు. ఆడుతూపాడుతూ ఉన్న తమ కుమారుడు కళ్లముందే మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. బాలుడి తండ్రి హరిబాబు ఫిర్యాదు మేరకు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పొందూరు ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు. ప్రమాదానికి కారణమైన వ్యక్తి మైనర్ అని గుర్తించామని, అదుపులోకి తీసుకున్నామన్నారు.

తీరం.. అభివృద్ధికి దూరం

- ఇదీ శివసాగర్ బీచ్ దుస్థితి
- పర్యాటకులకు సౌకర్యాలు కరువు
- నిలువ నీడ కూడా లేని వైనం



శివసాగర్ తీరం



శివసాగర్ తీరంలో పర్యాటకుల సందడి

వజ్రపుకొత్తూరు, మే 19(ఆంధ్రజ్యోతి):

జిల్లాలో అత్యధిక మంది సందర్శకులు వెళ్లే ప్రదేశాలలో శివసాగర్ బీచ్ ఒకటి. రోజురోజుకూ పర్యాటకుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ బీచ్ అభివృద్ధిపై అధికారులు శీతకన్ను వేస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. ఇక్కడికి వచ్చే వారు కనీసం విశ్రాంతి తీసుకునేందుకు అవసరమైన సదుపాయాలు కూడా లేవు. దీని వల్ల కుటుంబాలతో వచ్చే పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్ల సదుపాయం కూడా లేకపోవడంతో మహిళలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో పాటు కాశీబుగ్గ- పలాస మున్సిపాలిటీ, మెళియాపుట్టి, పాతపట్నం, ఒడిశాలోని పర్లాకిమిడి తదితర ప్రాంతాల నుంచి ప్రజలు శివసాగర్ తీరానికి వచ్చి సేద తీరుతుంటారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వీరంతా తీరంలో కనీస సదుపాయాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. స్థానికులే ఇటీవల మంచినీటి సదుపాయం, అక్కడక్కడా బెంచీలు ఏర్పాటు చేశారు. అధికారులు వచ్చి పరిశీలించి వెళ్లిపోతుంటారే తప్ప అభివృద్ధి పనులు చేపట్టలేదనే ఆరోపణలు ఉన్నాయి. టీడీపీ హయాంలో నిర్మించిన... ప్రస్తుతం పాడైన షెడ్ల కిందనే ప్రజలు సేదతీరాల్సి వస్తోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో బీచ్ అభివృద్ధి పేరిట హడావుడి చేశారే తప్ప ఎటువంటి పనులు చేపట్టలేదు. ముఖ్యంగా ఆదివారాలు, పిక్నిక్‌ల సీజన్‌లో పర్యాటకులు వేల సంఖ్యలో వస్తుంటారని... వారు వాహనాలు పార్కింగ్ చేయడానికి కూడా తగిన సౌకర్యాలు ఉండడం లేదని చెబుతున్నారు. తీరంలో పురాతన నీలకంఠేశ్వర ఆలయం ఉంది. భక్తులు ఆలయంలో పూజలు చేసి.. తీరానికి వెళుతుంటారు. వీరి కోసం కూడా ఎటువంటి వసతులూ కల్పించలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి.శివసాగర్ బీచ్ అభివృద్ధికి కృషి చేయాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి..



శివసాగర్ బీచ్‌కు నిత్యం పర్యటకుల తాకిడి అధికంగా ఉంటుంది. దూర ప్రాంతాల నుంచి కూడా పర్యాటకులు వచ్చి ఆహ్లాదంగా గడుపుతుంటారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని తీరాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. ఇదే జరిగితే స్థానికంగా ఉన్న యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. పర్యాటకంగా ఈ ప్రాంతం గుర్తింపు పొందుతుంది. పర్యాటకులకు సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

-ఎం.నాగేశ్వరరావు, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు, బైపల్లి

త్వరలో అభివృద్ధి పనులు..

శివసాగర్ బీచ్ అభివృద్ధికి ఓపీఎం (ఆర్గనైజేషన్ ప్రైవేటు మేనేజ్‌మెంటు) ద్వారా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే తీరంలో స్థల పరిశీలన పూర్తయింది. మరికొద్ది రోజులలో బీచ్ అభివృద్ధి పనులు జరిగే అవకాశం ఉంది. జిల్లా అధికారులతో మాట్లాడి బీచ్ అభివృద్ధి, పర్యాటకుల సౌకర్యాలపై దృష్టి పెడతాం.


-నారాయణరావు, జిల్లా పర్యాటక అధికారి

అల్లుకున్న నిర్లక్ష్యం... ఆదమరిస్తే ప్రమాదం



సాయిగిరి వద్ద విద్యుత్తు టవర్ దుస్థితి..

అరసవల్లి, మే19 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరంలో రద్దీగా ఉండే... ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో విద్యుత్తు స్తంభాలకు పిచ్చిమొక్కల తీగెలు చుట్టుకుని... ప్రమాదకరంగా తయారయ్యాయి. నిత్యం వందలాది ప్రజలు ప్రయాణం సాగించే సూర్యమహల్ కూడలి వద్ద గల స్తంభం పైనుంచి విద్యుత్తు ప్రసరించే తీగెల వరకు చేరుకున్నాయి. షార్ట్ సర్క్యూట్ సంభవించినా... లేదా వర్షం కురిసినా... తీగెలు తెగినా... మనుషులు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. కలెక్టరేట్ రోడ్డులో గల సాయిగిరి... పొన్నాడ బ్రిడ్జి వద్ద హెచ్.టి. విద్యుత్తు లైన్ టవరుకు తీగెలు చుట్టుకుని అత్యంత ప్రమాదకరంగా తయారయ్యాయి. నిత్యం ఈ దారుల్లో అనేక మంది ప్రజాప్రతినిధులు... అధికారులు తిరుగుతుంటారు. అయినా ఇవేమీ వారికి కనిపించకపోవడం గమనార్హం. పరిస్థితి చేయి దాటకముందే అధికారులు మేల్కొని.. ఈ తీగెలకు అల్లుకున్న పిచ్చి మొక్కలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



పొన్నాడ రోడ్డులో విద్యుత్తు టవర్‌కు అల్లుకున్న తీగెలు



సూర్యమహల్ జంక్షన్ వద్ద కరెంటు స్తంభానికి ఇలా...



పొన్నాడ వంతెన సమీపంలో...

మొర వింటూనే.. ఫిర్యాదు రాసిస్తూ..

(ఐదో పేజీ తరువాయి)

పోలీసులు సిద్ధమవుతున్నారు. తక్కువ ఖర్చుతో ఏఐ సాంకేతికతను వినియోగించుకోవచ్చు. ప్రతి జిల్లాలో 35 పోలీస్‌స్టేషన్ల వరకూ ఏఐని ప్రవేశపెట్టాలని పోలీసుశాఖ భావిస్తోంది.

ఏఐ పనితనం ఇలా..

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు రాయడానికి రైటర్ సహాయం తీసుకుంటారు. ఒక్కోసారి బాధితునికే అవి అర్థం కాని పరిస్థితి ఉంది. విచారణకు వచ్చే సమయానికి బాధితునికి తన బాధ తప్ప.. ఫిర్యాదులో ఏవి ఉన్నాయో గుర్తు ఉండదు. కొన్నిసార్లు ఫిర్యాదుదారులు చెప్పిన దానికి, కాగితంపై ఉన్నదానికి పొంతన కూడా ఉండని పరిస్థితి. ఈ కారణంగా కోర్టులో కేసు ఓడిపోయే సంఖ్య కూడా అధికంగా ఉంటోంది. దీన్ని సరిచేసుకోవడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ ఎంతో ఉపయోగపడుతుంది. దీన్ని గుర్తించిన పోలీసుశాఖ.. ఏఐ సేవలు అమలు చేయడానికి చర్యలు ప్రారంభించింది. భాష, ఎఫ్ఐఆర్‌లో సెక్షన్లు, నేర ఆధారాలు నిర్దేశం చేయడం, ఫోరెన్సిక్ ట్రిప్స్, ప్రాసిక్యూషన్ ట్రిప్స్, చార్జిషీటులో లోపాలు సవరణ చేయడం, డిఫెన్స్ న్యాయవాది వాదనలు ఎదుర్కోవలసిన తీరును సైతం నిర్దేశం చేస్తుంది. దీనివల్ల నేరాలు తగ్గుముఖం పట్టడానికి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పోలీసు శాఖ భావిస్తోంది. జిల్లాలో శ్రీకాకుళం, ఆమదాలవలస, నరసన్నపేట, కోటబొమ్మాళి, టెక్కలి, కాశీబుగ్గ, సోంపేట, ఇచ్ఛాపురం, పాతపట్నం పోలీసుస్టేషన్ల పరిధిలో ఏఐని అమలు చేయడానికి కసరత్తు ప్రారంభించింది.

ఎక్కడ వినియోగించాలో అక్కడ..



ఏఐని ఎక్కడ వినియోగించాలో అక్కడ ఉపయోగిస్తున్నాం. ఇప్పటికే మాకు తగిన ఆదేశాలు వచ్చాయి. ప్రస్తుతం సబ్‌డివిజన్‌లో ఇచ్ఛాపురం, సోంపేట, కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్లలో అమలు చేస్తున్నాం. నేర పరిశోధనకు ఏఐ ఎంతో వినియోగపడుతుంది. నిందితులు తప్పించుకోవడానికి వీలులేకుండా కేసులు పెట్టవచ్చు. కచ్చితమైన ఆధారాలు సేకరణకు సహకారం అందిస్తుంది. మొత్తం అమలులోకి వస్తే పని సులభతరం అవుతుంది.

-వి.వెంకట అప్పారావు, డీఎస్పీ, కాశీబుగ్గ

నేడు జీవవైవిధ్యంపై ఫొటో ఎగ్జిబిషన్

సోంపేట, మే 19(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం సందర్భంగా మంగళవారం పట్టణంలోని కళాసీ సంఘ భవనంలో బీలజీవవైవిధ్య ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నట్టు పర్యావరణ పరిరక్షణ సమితి అధ్యక్షుడు వై.కృష్ణమూర్తి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణసమితి, మత్స్యకార ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎగ్జిబిషన్ ఉదయం 8.30 గంటలకు మొదలు కానున్నట్టు తెలిపారు.

క్రీడాకారులకు అభినందన



పతకాలు సాధించిన వారిని అభినందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 19(ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన క్రీడాకారులను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అభినందించారు. ఈ నెల 5 నుంచి 15 వ తేదీ వరకు బిహార్‌లో జరిగిన ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో జిల్లాకు చెందిన గుజ్జల వర్షిత వెయిట్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం, అలాగే ఎస్.రామ్మోహన్ కబడ్డీలో కంచు పతకం సాధించారు. ఈ నేపథ్యంలో సోమవారం వారు కలెక్టర్, జేసీలను ప్రత్యేకంగా కలుసుకున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సాంకేతిక విద్య

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో సాంకేతిక విద్యకు నాంది పలికేలా 'జీరో సైన్స్ ల్యాబ్' వర్చువల్ ప్రయోగశాలలను ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నట్టు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. మొదటిగా స్మార్ట్ డిస్‌ప్లేలు ఉన్న ఐదు పాఠశాలల్లో ఈ ల్యాబ్‌ను ప్రారంభించి, విద్యార్థులపై ప్రభావాన్ని, ఫలితాలను విశ్లేషించనున్నామని తెలిపారు. సోమవారం గ్రీవెన్స్‌లో తనను కలిసిన సంస్థ ప్రతినిధులతో, ఎమ్మెల్యే శంకర్‌తో ఆయన మాట్లాడారు. ఇది గ్రామీణ విద్యార్థులకు టెక్నాలజీని సులభంగా పరిచయం చేసే ఒక వినూత్న కార్యక్రమమన్నారు. విద్యను ప్రయోగాత్మకంగా, ఆసక్తికరంగా బోధించేందుకు ఈ వర్చువల్ ల్యాబ్ ఎంతో ఉపయుక్తమన్నారు. ఈ పైలట్ ప్రాజెక్టుకు అవసరమైన అనుమతులు, సాంకేతిక మద్దతు కల్పించేందుకు సమగ్ర చర్యలు చేపట్టాలని సర్వశిక్ష అభియాన్ పీడీ శశిభూషణ్‌కు కలెక్టర్ సూచించారు.

పొడవాటి చెట్ల కింద ఉండొద్దు

బూర్జ, మే 19(ఆంధ్రజ్యోతి): ఉరుములు, మెరుపులు వచ్చినప్పుడు పొడవాటి చెట్ల కింద, పొలాల్లో ఉండరాదని ఎస్ఐ ప్రవల్లిక సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 19 నుంచి 23వ తేదీ వరకు ఉరుములు, మెరుపులు సంభవించే అవకాశముందని వాతావరణ శాఖాధికారులు చెబుతున్నారన్నారు. ఇందుకు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజలందరికీ సచివాలయం, వెటర్నరీ సిబ్బంది, వీఆర్‌వోలకు బాధ్యత ఉందన్నారు. ఉరుములు, పిడుగులు పడినప్పుడు అందరూ ఇళ్లల్లోనే ఉండాలన్నారు. ఖాళీ ప్రదేశాల్లో ఉన్నప్పుడు మోకాళ్లపై కూర్చొని రెండు చేతులతో చెవులను మూసుకోవాలన్నారు. ఆకర్షణ శక్తి ఉన్న వస్తువులు ఏవీ ముట్టుకోవద్దన్నారు. మొబైల్ ఫోన్ వాడకం తగ్గించాలన్నారు. పిడుగులు పడినప్పుడు స్విచ్ ఆఫ్ చేయాలని ఎస్ఐ సూచించారు. ఇంటిలో ఎలక్ట్రానిక్ వస్తువులను ఆపివేయాలన్నారు.

వివాహానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న భజన మండలి సభ్యులు

గార, మే 19(ఆంధ్రజ్యోతి): బోరవానిపేట గ్రామానికి చెందిన బోర కాంచనమాల వివాహానికి స్థానిక సత్యసాయి భజనమండలి రూ.2.7 లక్షలు సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో భజన మండలి కన్వీనర్ నర్సింహారావు, సేవాదళ్ కన్వీనర్ బోర సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

బాల్య మిత్రుడికి ..



సాయాన్ని అందజేస్తున్న మిత్రులు

ఇచ్ఛాపురం, మే 19(ఆంధ్రజ్యోతి): ఈదుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న బాల్య మిత్రుడు తిప్పన పుట్టుగ గ్రామానికి చెందిన కొన్నాయి గిరిదారి గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. తోటి మిత్రులు అంతా కలిసి రూ35వేలు ఆర్థిక సాయాన్ని సోమవారం ఇంటికి వెళ్లి అందజేశారు తోటి స్నేహితుల సాయాన్ని అందుకున్న గిరిదారి కన్నీరు పెట్టుకున్నారు. కార్యక్రమంలో బాల్య మిత్రులు నర్తు ప్రసాద్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డీడీ రామ్మోహనరావు

ఎచ్చెర్ల, మే 19(ఆంధ్రజ్యోతి): జిల్లాకు తుఫాన్ ప్రభావం ఉండడంతో అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ డీడీ పి.రామ్మోహనరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల, గ్రామ స్థాయి సిబ్బంది, రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు, గొర్రెల పెంపకందారులు మూడు రోజులపాటు ఇంటి వద్దనే ఉండి, పశువులు, గొర్రెలను బయటకు విడిచిపెట్టొదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వీవీ రామ్మోహనరావు, తహసీల్దార్ బి.గోపాల్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా పాత పంచాయతీ భవనం

- ఇతర అవసరాలకు వాడుకుంటున్న వైనం
- గ్రంథాలయంగా మార్చు చేయాలని వినతి



ఇతర అవసరాలకు ప్రైవేట్ వ్యక్తులు వినియోగించుకుంటున్న దృశ్యం



పాత పంచాయతీ భవనం

జి.సిగడాం, మే 19(ఆంధ్రజ్యోతి): పెంట గ్రామంలో గల పాత పంచాయతీ భవనం నిరుపయోగంగా దర్శనమిస్తుంది. గ్రామానికి చెందిన పలువురు తమ వ్యక్తిగత అవసరాలకు వినియోగించుకుంటున్నారని ఆ గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. లక్షలు నిధులు వెచ్చించి నిర్మించిన ప్రభుత్వ భవనం ఇలా ఎవరు పడితే వారు తమ సొంత అవసరాలకు వాడుకోవడం ఎంతవరకు సమంజసమని విమర్శిస్తున్నారు. ప్రభుత్వ భవనాన్ని తమ సొంత భవనంగా వినియోగించుకోవడంపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పదకొండో ఫైనాన్స్ నిధులతో 2004 సంవత్సరంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం హయాంలో నిర్మించారు. కొన్నేళ్ల అడపాదడపా ప్రభుత్వ కార్యక్రమాలకు వినియోగించే వారు కాని సుమారు 16 సంవత్సరాల నుంచి నిరుపయోగంగా ఉండడంతో పాటు ప్రైవేట్ వ్యక్తులు వాడుకుంటున్నారు. గ్రామంలో విద్యార్థులు, నిరుద్యోగ యువతకు గ్రాంథాలయం మంజూరు చేయాలని ప్రజాప్రతినిధులను కోరడం జరిగిందని యువకులు తెలిపారు. అందువల్ల అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి నిరుద్యోగులు పోటీ పరీక్షలకు తర్ఫీదు నిమిత్తం నిరుపయోగంగా ఉన్న పాత పంచాయతీ భవనాన్ని గ్రంథాలయంగా మార్పు చేయాలని గ్రామానికి చెందిన నిరుద్యోగ యువతీ, యువకులు, ఉద్యోగులు కోరుతున్నారు.

డయాలసిస్ బాధితులకు అండగా ఉంటాం

- ప్రభుత్వ విప్ బెందాళం అశోక్



డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న విప్, ఎమ్మెల్యే అశోక్

ఇచ్ఛాపురం, మే 19(ఆంధ్రజ్యోతి): ఉద్దానం కిడ్నీ బాధితులకు టీడీపీ అండగా ఉంటుందని, ఉద్దానాన్ని ఉద్యనవనంగా మారుస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. సామాజిక ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన కిడ్నీ డయాలసిస్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డయాలసిస్ సెంటర్‌ను పరిశీలించిన అక్కడ ఉన్న సదుపాయాల కోసం డీసీహెచ్ఎస్ కల్యాణ్ బాబుకు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం డయాలసిస్ బాధి తులకు ఐదు బెడ్స్ ఉన్నాయని, అదనంగా మరో నాలుగు బెడ్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. వైద్యులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండి డయాలసిస్ బాధితులకు ఇబ్బందులు తలెత్తకుండా సకాలంలో వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.దేవేంద్రరెడ్డి అధ్యక్షతన జరిగి న సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2014లో చంద్ర బాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు డయాలసిస్ బాధితుల కోసం చర్యలు తీసుకున్నారని, ఆ తర్వాత ప్రస్తుత డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కిడ్నీ బాధితులపై ప్రత్యేక దృష్టి సారించి సమస్య పరిష్కార దిశగా తీసుకెళ్లారన్నారు. నియోజకవర్గంలో మూడు చోట్ల ఇచ్ఛాపురం, కవిటి, సోం పేట, మండలాల్లో డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేసి డయాలసిస్ బాధితులను ఆదుకున్న ఘనత చంద్రబాబుదే అని అన్నారు. ప్రస్తుతం సోంపేటలో 22, కవిటిలో 20, ఇచ్ఛాపురంలో ఐదు, పలాసలో 10 డయాలసిస్ బాధితులకు కోసం బెడ్స్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం డయాలసిస్ కోసం బిల్డింగ్‌ను మాత్రమే ఏర్పాటు చేసిందని, డయాలసిస్ సెంటర్ కోసం ఎటువంటి పనులు చేయలేదన్నారు. ఉద్దానం కిడ్నీ బాధితుల కోసం శుద్ధజలం అందించాలనే ఉద్దేశంతో ఎన్టీఆర్ శుద్ధ జలనీటి పథకం ద్వారా రూ.2కే 20లీటర్లు శుద్ధ జలం అందించారన్నారు. గత 5ఏళ్లలో వైసీపీ ప్రభు త్వం అధికారంలో ఉండి కిడ్నీ బాధితులను పట్టించుకోకుండా వారి ప్రాణాలతో చలగాటం ఆడుకున్నారని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కిడ్నీ బాధితులపై ప్రత్యేక దృష్టిసారించి డయాలసిస్ రీసెర్చ్ సెంటర్లు ఏర్పాటు చేస్తుంటే వైసీపీ నాయకులు విమర్శలు చేయటం విడ్డూరంగా ఉందన్నారు. రూ700కోట్లు ఖర్చు చేసి 800గ్రామాలకు ఇంటింటికి కులాయి నీరు అందిస్తామన్న వైసీపీ ప్రభుత్వం కనీసం 200గ్రామాలకు కూడా నీరందివ్వలేన్నారు. కార్యక్రమంలో డీసీహెచ్‌సీ ఎస్.కల్యాణ్‌బాబు, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ పి.దేవేంద్రరెడ్డి, ఎమ్మెల్సీ నర్తు రామారావు, జనసేన పార్టీ ఇన్‌చార్జి దాసరి రాజు, బీజేపీ నాయకురాలు మంగి లక్ష్మి, టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కాళ్ల ధర్మారావు, నందికి జాని, కౌన్సిలర్లు కాళ్ల దిలీప్, ఆశి లీలారాణి, పత్రి తవిటయ్య, బీసీ సాధికార సమితి కన్వీనర్ కొండా శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సస్పెన్షన్ ఎత్తివేయండి



కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఐక్యవేదిక ప్రతినిధులు

పాత శ్రీకాకుళం, మే 19(ఆంధ్రజ్యోతి): కుప్పిలి మోడల్ స్కూల్ ఆంగ్ల ఉపాధ్యా యుడు కనకరాజు సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని, అదే విధంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విచారణ నివేదిక మేరకు డీఈవో పై చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ ఐక్యవేదిక ప్రతినిధులు కోరారు. ఈ మేరకు సోమవారం ఉదయం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్, ఏపీటీఎఫ్, డీటీఎఫ్, ఎస్టీయూ, బీటీఏ, ఎస్ఎల్‌టీఏ, ఎస్సీఎస్టీ యూనియన్ తదితర ఉపాధ్యాయ సంఘాల ప్రధాన నాయకులు, టి.మురళీమోహన్, ఎస్.కిశోర్, పి.కృష్ణారావు, డి.శివరాం ప్రసాద్, వి.శరత్ బాబు, చావలి శ్రీనివాస్, సదాశివుని శంకరరావు తదితరులు ఉన్నారు.

గారలో తిరంగా ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న కూటమి నేతలు

గార, మే 19(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో సోమవారం గారలో కూటమి నేతల ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు నినాదాలు చేశారు. కార్యక్రమంలో గార సర్పంచ్ మార్పు పృథ్వీరాజ్, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో జీరో సైన్స్ ల్యాబ్



కలెక్టర్‌కు జీరో సైన్స్‌ల్యాబ్ గురించి వివరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర విద్యాశాఖ అనుబంధ సంస్థ ఏఐసీటీఈ ఆమోదించిన జీరో సైన్స్ ఇంటరాక్టివ్ డిజిటల్ ల్యాబ్స్ ఇప్పుడు శ్రీకాకుళం నియోజకవర్గంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభం కానున్నాయి. ఈ ప్రాజెక్టును ఎమ్మెల్యే గొండు శంకర్ చొరవతో, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అనుమతితో అమలు చేయడానికి ఒప్పందం కుదిరింది. ఈ మేరకు ఎమ్మెల్యే శంకర్ సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్‌ను కలిసి చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్టు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని, విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎడ్జ్ వన్ ఎండీ రామదేవ్ మాట్లాడుతూ.. ఐదు సంవత్సరాల పరిశోధన ఫలితంగా విద్యార్థుల్లో గణితం, సైన్స్‌పై భయం పోగొట్టి, వాటిపై ఆసక్తి కలిగించేలా ఈ జీరో సైన్స్ ల్యాబ్‌ను రూపొందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో భాగంగా ఒప్పంద భాగస్వామి సంస్థ సెర్వొయింట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ అధ్యక్షుడు కొత్తకోట సత్యసాయి, సంతోష్‌లు పాల్గొన్నారు.

ఫిర్యాదులు పరిష్కరించడంలో జాప్యం చేయొద్దు: ఎస్పీ



వృద్ధురాలి సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, మే 19(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదులు స్వీకరణ, పరిష్కార కార్యక్రమంలో వచ్చే ప్రజా ఫిర్యాదులకు ప్రాధాన్యం ఇస్తూ జాప్యం లేకుండా త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పోలీస్ అధికారులకు ఆదేశించారు. చట్ట పరిధిలో చర్యలు చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని ఆయన అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి 50 మంది ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడి ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకొని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఫిర్యాదారుల అర్జీలు, వారి వివరాలు సంబంధిత పోలీస్ అధికారులు జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా తక్షణమే సంబంధిత పోలీస్ అధికారులకు తెలియపరిచి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పట్ల అత్యంత ప్రాధాన్యం ఇస్తూ నిర్లక్ష్యం వహించకుండా త్వరితగతిన పరిష్కారం చూపాలని సూచించారు. కార్యక్రమంలోఎస్పీ స్వయంగా వృద్ధులు, వికలాంగ అర్జీదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఆయా ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదిక రూపంలో చెల్లించాలని ఆయా స్టేషన్ల ఇన్‌చార్జీలను ఎస్పీ ఆదేశించారు.

సత్ప్రవర్తనతో నడిచి నేరవృత్తికి స్వస్తి పలకాలి

ఆమదాలవలస, మే 19(ఆంధ్రజ్యోతి): సర్కిల్ పరిధి నాలుగు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న నేరచరిత్ర ఉన్న వ్యక్తులు సత్ప్రవర్తనతో నడచుకొని నేర వృత్తికి స్వస్తి పలకాలని సీఐ పి.సత్యనారాయణ తెలిపారు. రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ కార్యక్రమం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ పొందూరు, ఆమదాల వలస, బూర్జ, సరుబుజ్జిలి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లు చెడు నడత గలవారు నేరాలు చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, ఘర్షణలకు దూరంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరు ఎలాంటి నేరాలకు పాల్పడకుండా నేర వత్తిని మాని మంచి నడవడికతో మెగాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలా పాలకు పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవ న్నారు. ముఖ్యంగా గంజాయి, మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాతో పాటు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు బాలరాజు, హైమావతి, ప్రవల్లిక, సత్యనారాయణ పాల్గొన్నారు.

పుచ్చలపల్లికి ఘన నివాళి



ఎచ్చెర్ల: నివాళులర్పిస్తున్న కార్మికులు

ఎచ్చెర్ల, మే 19(ఆంధ్రజ్యోతి): కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కార్యక్రమాన్ని అరిణాం అక్కివలస పరిధిలోని నాగార్జున అగ్రికెమ్ పరిశ్రమల ఆవరణలో కార్మికులు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు మాట్లాడుతూ.. సంపన్న కుటుంబంలో పుట్టిన పుచ్చలపల్లి తన యావదాస్తిని కష్ట జీవుల ఉద్యమానికే దారపోశారన్నారు. కార్యక్రమంలో ఎల్.రామప్పడు, అంబటి సత్యనారాయణ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా జిల్లా వ్యాప్తంగా పుచ్చలపల్లి వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు.

- రణస్థలం, మే 19(ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధికి పుచ్చలపల్లి సుందరయ్య ఎంతో కృషి చేశారని సీఐటీయూ నాయకులు సీహెచ్ అమ్మన్నాయుడు అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి వేడుకలు పైడిభీమవరం శ్యామ్‌క్రగ్ పిస్టన్స్ పరిశ్రమ ఎదురుగా సోమవారం చేపట్టారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళలర్పించారు. కార్యక్రమంలో వి.లక్ష్మణరావు, మహేష్, ఎం.రమణ, వి.మధు, సూరప్పన్న తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల రక్తదానం

ఎచ్చెర్ల, మే 19(ఆంధ్రజ్యోతి): శ్యాం పిస్టన్స్ పరిశ్రమ (అరిణాం అక్కివలస) పరిశ్రమ వ్యవస్థాపకులు ఎస్‌డీఎం రావు రెండో వర్ధంతి సందర్భంగా కార్మికులు సోమవారం రక్తదానం చేశారు. ఈ శిబిరాన్ని పరిశ్రమ ఆపరేషన్స్ డైరెక్టర్ ఎస్.కిశోర్ ప్రారంభించారు. శ్రీకాకుళం సర్వజనాసుపత్రి బ్లడ్ బ్యాంకు, రెడ్‌క్రాస్ సిబ్బంది ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహించగా 65 మంది కార్మికులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, వైద్యులు కావ్య, కౌన్సిలర్ ఎస్.తాతారావు, కార్మిక సంఘ కార్యదర్శి ఆర్.అనంతరావు ఉపాధ్యక్షులు ఎం.శ్యామసుందరరావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ స్పీకర్ పరామర్శ

ఆమదాలవలస, మే 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వివిధ వార్డుల్లో ఇటీవల అనారోగ్యాలతో మరణించిన పలు కుటుంబాలను మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం పరామర్శించారు. సోమవారం ఉదయం ముందుగా రెండో వార్డు కృపాపురంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మెట్ట రాజారావు కుటుంబాన్ని పరామర్శించారు. మిగిలిన వార్డుల్లో కూడా పర్యటించి మృతుల కుటుంబాలను పరామర్శించారు. ఆయనతో పాటు మెట్ట కృష్ణ, సురేష్, సనపల రవి, ధనుంజయ్, హరీష్ రాజు, అనంత, మురళి ఉన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన

శ్రీకాకుళం క్రైం, మే 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతుందని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. పలాస మండలం అంబుసోలి గ్రామంలో ఈ నెల 11న జరిగిన కుటుంబ తగాదాల నేపథ్యంలో పలాస పోలీస్‌స్టేషన్‌కు ఇరు వర్గాలు ఫిర్యాదు చేస్తే అక్కడ సీఐ ఒక వర్గం ఫిర్యాదుదారులపై కులదోషణ చేయడం తగదన్నారు. పలాస సీఐ కుల దోషణకు దిగాడంటూ బాధితులు తరఫున ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదులు స్వీకరణ, పరిష్కార కార్యక్ర మంలో ఎస్పీ మహేశ్వర రెడ్డికి ఫిర్యాదు చేశారు.

ఘనంగా సత్యదేవుడి కల్యాణం

ఎచ్చెర్ల, మే 19(ఆంధ్రజ్యోతి): అల్లినగరంలోని రమా సత్యన్నారాయణస్వామి ఆలయ ద్వాదశ వార్షికోత్సవ కార్యక్రమాలు ఈ నెల 17,18,19 తేదీల్లో నిర్వహించారు. సోమవారం సత్యదేవుని కల్యాణం కమనీయంగా జరిగింది. అనంతరం అన్న సంతర్పణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు వురిటి భార్గవ్ ప్రసాద్, సత్యవతి దంపతులు, అమలాపురపు శివ, వురిటి సురేష్, గొల్ల స్వామి పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి


వెంకటి (ఫైల్)

సరుబుజ్జిలి, మే 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కూన జమ్మన్నపేట గ్రామానికి చెందిన హనుమంతు వెంకటి (60) అనే రోజు కూలి అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆ వివరాలు ఇలా.. ఎప్పటిలాగే ఆదివారం రోజువారీ కూలి పనికి వెళ్లి సాయంత్రం తిరిగి రాలేదు. రాత్రి సుమారు 8 గంటల సమయంలో సరుబుజ్జిలి గ్రామానికి చెందిన ఒక వ్యక్తి కూన జమ్మన్నపేట గ్రామాల మధ్య వెంకటి రోడ్డు పక్కన పడి ఉన్నట్టు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. వెంటనే అక్కడకు చేరుకొని 108 వాహనంలో శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు ఆసుపత్రి సిబ్బంది తెలిపారు. ప్రమాదవశాత్తూ తన భర్త ప్రాణాలు కోల్పోయి రోడ్డు పక్కన పడి ఉన్నా రనే అనుమానంతో భార్య నారాయణ మ్మ సరుబుజ్జిలి పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేశారు. రిమ్స్ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

కొంగరాంలో తాపీమేస్త్రి..


శ్రీనివాసరావు (ఫైల్)

ఎచ్చెర్ల, మే 19(ఆంధ్రజ్యోతి): కొంగరాం గ్రామానికి చెందిన తాపీమేస్త్రి సూరపు శ్రీనివాసరావు(39) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పొన్నాడ బ్రిడ్జి రోడ్‌లో సోమవారం ఉదయం ఓ మెకానిక్ షెడ్‌కు సమీపంలోని పొలాల్లో శ్రీనివాసరావు మృత దేహాన్ని గుర్తించారు. మద్యం అలవాటు ఉన్న ఈయన ఆదివారం రాత్రి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. శ్రీనివాసరావుకు గార మండలం అయ్యవారిపేట గ్రామానికి చెందిన హైమావతితో కొన్నేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు కాగా, పెద్ద కుమార్తెకు ఇటీవల వివాహం జరిగింది. మద్యం సేవించి నిత్యం భార్యతో గొడవపడుతుండేవాడు. ఈ క్రమంలో ఆమె రెండు నెలల కిందట కన్నవారింటికి వెళ్లి పోయింది. దీంతో నిత్యం మద్యం తాగుతూ శ్రీనివాసరావు ఆదివారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ వి.సందీప్ కుమార్, క్లూస్ టీమ్ సందర్శించి వివరాలు సేకరించారు. భార్య హైమా వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా దర్యాప్తు చేస్తామన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి..


గుర్తు తెలియని మృతదేహం

పలాస, మే 19(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ 5వ వార్డు తాళభద్ర గ్రామ సమీపంలో సోమవారం గుర్తు తెలియని మృతదేహం ఉండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. తాళ భద్ర-అక్కుపల్లి రోడ్డులో నీలం రంగు జీన్ ప్యాంట్, మెరూన్ కలర్ షర్టు ధరించి ఉన్నట్లు స్థానికులు గుర్తించారు. ఈ విషయాన్ని వీఆర్వో ఎర్ర య్యకు సమాచారం అందించగా, ఆయన ఘటనా స్థలాన్ని పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి ..


ఈశ్వరరావు (ఫైల్)

రణస్థలం, మే 19(ఆంధ్రజ్యోతి): ముక్తుంపురం గ్రామానికి చెందిన బోనెల ఈశ్వరరావు(43) కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. జేఆర్‌పురం ఎస్ఐ ఎస్ చిరంజీవి చెప్పిన వివరాల మేరకు.. ఈనెల 16వ తేదీన ఈశ్వరరావు ప్రమాదవశాత్తు మేడపై నుంచి పడిపోవడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈశ్వరరావుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య మంగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎచ్చెర్లకి చెందిన మహిళ..


రాజులమ్మ(ఫైల్)

ఎచ్చెర్ల, మే 19(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల గ్రామానికి చెందిన నేతింటి రాజులమ్మ (55) ఈనెల 17న పాముకాటుకు గురై శ్రీకాకుళం సర్వజనాసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. ఈమె తన భర్త అప్పలసూరితో కలిసి ఈ నెల 17న (శనివారం) పొలంలో గడ్డి కోయడానికి వెళ్లగా.. పాముకాటుకు గురైంది. వెంటనే కుటుంబ సభ్యులు ఆమె ను ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతిచెందింది. ఈమెకు నలుగురు కుమారులు కాగా, ఇందులో ఒక కుమారుడు నేతింటి రాజారావు స్థానిక టీడీపీ నాయకుడిగా ఉన్నారు.

వృద్ధుడి అదృశ్యం


అదృశ్యమైన నర్సింగపండా

పలాస, మే 19(ఆంధ్రజ్యోతి): మరదరాజపురం గ్రామానికి చెందిన 98 ఏళ్ల నర్సింగపండా ఈనెల 12వ తేదీ నుంచి కనిపించలేదని కుమారుడు జగన్నాథ ప్రసాద్‌పండా సోమవారం కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. డీలర్‌గా పనిచేస్తున్న నర్సింగ్ పండా భార్యతో భోజనం కోసం గొడవపడి 12న ఇంటి నుంచి వెళ్లి పోయాడు. అప్పటి నుంచి ఆయన కోసం వెతికినా ఫలితం లేక పోయిందని, నీలి రంగు ప్యాంటు, తెలుపు-నీలం గంగు కలిగిన గళ్ల షర్టు వేసుకున్నాడని, ఆయన ఆచూకీ తెలిస్తే సమాచారం ఇవ్వాలని సీఐ పి. సూర్యనారాయణ కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నిద్రిస్తున్న లారీ డ్రైవర్లపై దాడి

నందిగాం, మే 19(ఆంధ్రజ్యోతి): నందిగాం మండలం పెద్దతామరాపల్లి సమీపంలోని జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి నిలిపి ఉన్న లారీల డ్రైవర్లపై గుర్తు తెలియని వ్యక్తులు దాడిచేసి రూ.28 వేల నగదు, సెల్‌ఫోన్లను చోరీ చేశారు. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. చెన్నై నుంచి కోల్‌కతా వెళ్తున్న లారీలు ఆదివారం రాత్రి 9 గంటలు ప్రాంతంలో పెద్దతామరాపల్లి సమీపంలో దాబాలో భోజనం అనంతరం లారీల్లోనే నిద్రిస్తుండగా అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో ఐదుగురు వ్యక్తులు విజయ్‌కుమార్‌కి కత్తి చూపించి బెదిరించి భయభ్రాంతులకు గురి చేయడంతో ఆయన లారీ సెల్ఫ్ చేసి వెళ్లిపోగా బీహార్‌కు చెందిన డ్రైవర్లు సుజిత్‌కుమార్ రాయ్, అమర్ జిత్ చౌహాన్, పురుషోత్తమసింగ్ వరుసగా లారీల్లో నిద్రి స్తుండగా రాళ్లతో లారీ అద్దాలను పగలగొట్టి డ్రైవర్లను గాయపరిచారు. కత్తులు చూపించి వారి వద్దనున్న సెల్‌ఫోన్లు, సుమారు రూ.28 వేలు నగదును తీసుకొని పొలాల నుంచి పరారయ్యారు. అనంతరం డ్రైవర్లు కేకలు వేయడంతో దాబా సిబ్బంది చూసి గాయపడిన వారిని టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. దాడిలో పాల్గొన్న వారు తెలుగు, హిందీల్లో మాట్లాడుతూ 30 సంవత్సరాల లోపు వాళ్లే ఉన్నారని బాధి తులు తెలిపారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే సుభద్రాపురం వద్ద అర్ధరాత్రి 2 గంటల తరువాత ద్విచక్ర వాహనంపై వెళ్తూ మూత్ర విసర్జనకు వాహనాన్ని నిలిపిన వ్యక్తిపై కొంతమంది దాడి చేసి బెదిరించి నగదును తీసుకువెళ్లి పోయినట్లు తెలిసింది. బాధితులు దాడి విషయం తెలిపారని, పరిశీలించి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

గ్రానైట్ క్వారీల తనిఖీ

టెక్కలి, మే 19(ఆంధ్రజ్యోతి): మెళియాపుట్టి మండలం దబ్బగుడ్డి పరిధిలో మౌనిష్‌రెడ్డి, కూనపురెడ్డి గ్రానైట్ క్వారీలో ఈనెల 16న పేలుళ్లతో ముగ్గురు మృతి చెందిన నేపథ్యంలో రెవెన్యూ, పోలీస్, మైన్స్ శాఖల అధికారులు తనిఖీలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా సోమ వారం టెక్కలి మండలంలో ఎక్స్ ప్లోజివ్స్ లైసెన్స్ కలిగి ఉన్న పలు గ్రానైట్ క్వారీలను ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, సీఐ ఎ.విజయ్‌కుమార్ తనిఖీ చేశారు. ఆయా కారీల్లో ఏ మేరకు పేలుడు పదార్థాలు కలిగివున్నారు, అన్నిరకాల అనుమతులున్నాయా తదితర వివరాలను సేకరించారు. క్వారీల్లో మైనింగ్ సేఫ్టీ మేనే జర్‌తో పాటు స్కిల్డ్ లేబర్ ఏ మేరకు ఉన్నారన్న వివ రాలపై ఆరాతీశారు. క్వారీలకు పర్యావరణ, రెవెన్యూ, మైన్స్ అనుమతులు తప్పనిసరి అని స్పష్టం చేశారు.


టెక్కలి: క్వారీని పరిశీలిస్తున్న ఆర్డీవో కృష్ణమూర్తి


కొత్తూరు: శోభనాపురం వద్ద క్వారీని తనిఖీ చేస్తున్న తహసీల్దార్, ఎస్ఐ

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

కొత్తూరు, మే 19(ఆంధ్రజ్యోతి) స్టోన్ క్రషర్లలో నిబం ధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుం టామని తహసీల్దార్ కె.బాలకృష్ణ తెలిపారు. సోమవారం శోభనాపురం, దిమిలి, రాయల వద్ద ఉన్న నాలుగు స్టోన్ క్రషర్లను ఎస్ఐ ఎండీ అమీర్ ఆలీతో కలిసి తనిఖీ చేశారు. రాయిని పేల్చేందుకు లెసెన్స్ ఉన్న వారితో మాత్రమే బాంబు పేలుళ్లు చేపట్టాలన్నారు. అనుమతులు లేని వారితో పేలుళ్లు చేయిస్తే సంబంధిత యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తా మని స్పష్టం చేశారు. వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

స్టోన్‌క్రషర్ క్వారీల పరిశీలన

హిరమండలం, మే 19(ఆంధ్రజ్యోతి): ఇటీవల మెళియాపుట్టి గ్రానైట్ క్వారీలో ముగ్గురు కార్మికులు మృతి చెందిన నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. తహసీల్దార్ హనుమంతురావు, ఎస్ఐ ఎండీ యాసిన్, ఆర్ఐ శంకరరావు మండలంలోని పలు స్టోన్‌క్రషర్ క్వారీలను సోమవారం తనిఖీ చేశారు. ప్రస్తుతం పని చేస్తున్న లోకొండ,సుభలయ క్వారీలను తనిఖీ చేసి నిబంధనలు పాటిస్తున్నారా లేదా అన్నది పరిశీలించారు.

పనులు నిలుపుదల చేయాలి

మెళియాపుట్టి, మే 19(ఆంధ్రజ్యోతి): మండలంలో గల పద్ద రెవెన్యూ గ్రూపులో ఉన్న గ్రానైట్ క్వారీని సోమవారం రెవెన్యూ, మైనింగ్, పోలీసు అధికారులు పరిశీలించారు. ఇటీవల డబ్బగూడ గ్రానైట్ క్వారీలో బ్లాస్టింగ్ జరిగి ముగ్గురు మృతి చెందిన విషయం తెలిసిందే. దీనిపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాలతో అధికారులు గ్రానైట్ క్వారీలను తనిఖీ చేస్తున్నారు. పరిశీలన తరువాత తిరిగి అధికారుల ఆదేశాలతో క్వారీలు ప్రారంభించాలని, అప్పటి వరకు నిలుపుదల చేయాలని తహసీల్దార్ బి.పాపారావు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ రమేష్‌బాబు, మైనింగ్ అధికారులు పాల్గొన్నారు.



హిరమండలం, మెళియాపుట్టి మండలాల్లో స్టోన్, గ్రానైట్ క్వారీలను పరిశీలిస్తున్న అధికారులు

మండల ఉపాధ్యక్షురాలిగా కల్యాణి ఏకగ్రీవం

- టీడీపీ మద్దతురాలికి వరించిన పదవి

జలుమూరు (సారవకోట) మే 19(ఆంధ్రజ్యోతి): మండల ఉపాధ్యక్షురాలిగా మాళువ ఎంపీటీసీ జమ్మినివలస కల్యాణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో వైస్ ఎంపీ పీగా వ్యవహరించిన యడల్ల అసిరయ్య మృతి చెందడంతో సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎన్నిక ఎన్నికల అధికారి మంద లోకనాథం వైస్ ఎంపీపీకి ఎన్నిక నిర్వహించారు. ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు కల్యాణి పేరును సూచించగా కిట్టాలపాడు ఎంపీటీసీవిజయకుమారి ప్రతిపాదించారు. గుంపాడ ఎంపీటీసీ పంగ అప్పారావు బలపరిచారు. ఈ ఎన్నికకు 12 మంది ఎంపీటీసీలు హాజరుకాగా మండల ఉపాధ్యక్షుడు గుణుపూర్ రామారావు మినహా మిగిలిన 11 మంది కల్యాణికి మద్దతుగా చేతులెత్తడంతో ఆమె ఎన్నిక ఏకగ్రీవమైనట్లు మండల ప్రత్యేకాధికారి లోకనాథం ప్రకటించి ధ్రువీకరణ పత్రాన్ని అందించారు. అనంతరం ఆమెను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి కృషి చేస్తా: కల్యాణి

మండల అభివృద్ధికి ఎమ్మెల్యే రమణమూర్తి, ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు సహకారం తో కృషి చేస్తానని మండల ఉపాధ్యక్షురాలిగా ఎన్నికైన జమ్మినివలస కల్యాణి అన్నారు. ఎన్నిక ధ్రువీకరణ పత్రం అందుకున్న తరువాత ఆమె మాట్లాడుతూ.. తన ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్యే, ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.


వైస్ ఎంపీపీగా ఎన్నికైన కల్యాణిని అభినందిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

మెళియాపుట్టిలో తిరంగా ర్యాలీ

మెళియాపుట్టి, మే 19(ఆంధ్రజ్యోతి): భారతదేశ ఖ్యాతిని ప్రపంచ దేశాలకు తెలిసేలా ఆపరేషన్ సిందూర్ చేపట్టడం జరిగిందని పాతపట్నం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి సలాన శరత్ కుమార్ తెలిపారు. సోమవారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సైనికుడు కోటేశ్వరరావును సత్కరించారు. సలాన రాఘవరావు పాల్గొన్నారు.

కుల ధ్రువీకరణ పత్రాల కోసం గిరిజనుల పాట్లు

కొత్తూరు, మే 19(ఆంధ్రజ్యోతి): కుల ధ్రువీకరణ పత్రాల కోసం గిరిజనులు కార్యాలయాలకు చుట్టూ తిరగాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తాము దరఖాస్తు చేసుకుని 40 రోజులవుతున్నా సచివాలయ అధికారులు పట్టించుకోలేదని పొనుటూరు పంచాయతీ బంకి గిరిజనగూడకి చెందిన గిరిజనులు వాపోయారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి సమస్యను అధికారులకు విన్నవించారు. న్యాయం చేయాలని తహసీల్దార్ బాలకృష్ణను వేడుకున్నారు. దీనిపై తహసీల్దార్‌ను వివరణ కోరగా కుల ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తు చేయటం వాస్తమేనని, వీటిపై సమగ్రంగా పరిశీలన చేసి తగుచర్యలు తీసుకుంటామన్నారు.

ఇంటింటికీ తాగునీటి సరఫరాకు చర్యలు

పలాస, మే 19(ఆంధ్రజ్యోతి): ఉద్దానం రక్షిత నీటి పథకం ద్వారా ప్రతి ఇంటికి తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామని మునిసిపల్ కమిషనర్ ఎన్.రామారావు తెలిపారు. సోమవారం మునిసిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో సచివాలయ కార్యదర్శులు, ఇంజనీ రింగ్, నీటి విభాగం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. దశలవారీగా నీటిని సరఫరా చేసే కార్యక్రమం చేపడతామన్నారు. ● ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వివిధ సమస్యలపై 10 వినతులు అందాయి. సోమవారం కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. వితంతు పింఛన్లు, ఆస్తి పన్ను పేరు మార్పిడి, జనన, మరణ ధ్రువ పత్రాలు, తాగునీటి సరఫ రా చేయాలని వినతులు వచ్చాయన్నారు.

అధికారుల గైర్హాజరు


అధికారులు లేక వెలవెలబోతున్న గ్రీవెన్స్ విభాగం

టెక్కలి, మే 19(ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రతి వారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఈ సోమవారం పలు శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. ఉదయం 11 గంటలకు పంచాయతీరాజ్, డీఎల్‌డీవో, సాంఘిక సంక్షేమ శాఖ, ఐసీడీఎస్, వెనుకబడిన తరగతుల శాఖ, డ్వామా, ఉద్యానవనశాఖ, వైద్య, ఆరోగ్యశాఖ, ఉప విద్యా శాఖ, పశుసంవర్ధకశాఖ అధికారులు హాజరు కాలేదు. ఇక కొన్ని శాఖలకు సంబం ధించి కిందిస్థాయి ఉద్యోగులు వచ్చి మమ అనిపించారు. ఈ విషయమై ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి వద్ద ఆంధ్రజ్యోతి ప్రస్తావించగా గైర్హాజరైన అధికారులను గుర్తించి ఇప్పటికే మెమో జారీ చేశామన్నారు. ● సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం పలు సమస్యలపై ఆర్డీవో ఎం.కృష్ణమూర్తికి వినతిపత్రం అందజేశారు. 1బీ, వృద్ధాప్య పింఛన్లు, ఇళ్ల కాలనీలు, భూ సమస్యలపై పలువురు అర్జీలు అందజేశారు.

పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు చట్టరీత్యా నేరం


టెక్కలి: మాట్లాడుతున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి నిర్మల

టెక్కలి, మే 19(ఆంధ్రజ్యోతి): పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులు చటరీత్యా నేరమని సీనియర్ సివిల్ న్యాయాదికారి బి.నిర్మల అన్నారు. సోమవారం కోర్టు సముదాయం ప్రాంగణంలో ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లతో సమావేశం నిర్వహించి చట్టాలపై అవగాహన కలిగించారు. ఏ సంస్థలో అయినా లైంగిక వేధింపులున్నట్లయితే వెంటనే యజమానికి ఫిర్యాదు చేయాలన్నారు. సమావేశంలో న్యాయవాదులు గోవింద్, మధు బాబు, బాలకృష్ణ, గోపాలకృష్ణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు న్యాయ సలహాలు

హిరమండలం, మే 19(ఆంధ్రజ్యోతి): వృద్ధులకు న్యాయ పరమైన సలహాలు కావా లంటే తనను సంప్రదిం చాలని కొత్తూరు జూనియర్ సివిల్ న్యాయాధికారి కందిక్ట రాణి అన్నారు. సోమవారం హిరమండలం ప్రేమసాయి వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. అక్కడ ఉంటున్న వృద్ధుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ అధ్యక్షుడు అందవరపు అబ్బాయి, ఎస్.సాయిబాబా, సురేష్, నర్సింహమూర్తి, లంక రామారావు తదితరులు పాల్గొన్నారు.


వృద్ధుల సమస్యలు తెలుసుకుంటున్న న్యాయాధికారి రాణి

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

నరసన్నపేట, మే 19(ఆంధ్రజ్యోతి): కోమర్తి గ్రామం వద్ద జాతీయ రహదారిపై సోమవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి (31) మృతి చెందగా మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. నరసన్నపేట నుంచి శ్రీకాకుళం వైపు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఒడిశాకు చెందిన వ్యక్తి మృతిచెందారు. మరో వ్యక్తికి తీవ్ర గాయాలై అపస్మారక స్థితిలో ఉన్నారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన ప్రాంతాన్ని ఎస్ఐ దుర్గాప్రసాద్ పరిశీలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.


మృతి చెందిన ఒడిశా వాసి, ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ దుర్గాప్రసాద్

కిడ్నీ పరిశోధన కేంద్రంలో మౌలిక వసతులు కల్పించండి

పలాస, మే 19(ఆంధ్రజ్యోతి): పలాస ప్రభుత్వ ఆసుపత్రిలో ఈఎన్‌టీ, నేత్ర విభాగాలతో పాటు కిడ్నీ పరిశోధన కేంద్రంలో పూర్తిస్థాయి వసతులు కల్పించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రిని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను పలాస బీజేపీ నాయకులు కలిసి ఆసుపత్రి సమస్యలపై వినతిపత్రం అందించారు. పలాస ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బందితో పాటు బెడ్స్ కొరత తీవ్రంగా ఉందని, అసంపూర్తిగా పనులు చేసి వదిలేశారని, ప్రహరీ లేదని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. అలాగే కిడ్నీ పరిశోధన కేంద్రంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు పైడి వేణుగోపాలం, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వైకుంఠరావు, నేతలు కంచరాన బుజ్జి, పి.తారకేశ్వరరావు, వెంకటరమణ ఉన్నారు.

న్యూస్ బాక్స్

'పది' సప్లిమెంటరీ పరీక్షల పరిశీలన

నరసన్నపేట, మే 19(ఆంధ్రజ్యోతి): పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలను డిప్యూటీ డీఈవో విజయకుమారి సోమవారం స్థానిక సెయింట్ క్లారెట్ కేంద్రంలో పరిశీలించారు. ఎటువంటి మాల్ ప్రాక్టీస్ జరగకుండా చర్యలు తీసుకోవాలని చీఫ్ సూపరెండెంట్‌కు సూచించారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఉప్పాడ శాంతారావు, పేడాడ దాలినాయుడు పాల్గొన్నారు.

రక్తదానానికి ముందుకు రావాలి

వజ్రపుకొత్తూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రక్తనిల్వలు అవసరమవుతున్నందున యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని వక్తలు కోరారు. పూండిలో యువతరం సేవా సమితి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 21 మంది యువకులు రక్తదానం చేయగా వారికి సర్టిఫికెట్లు అందించారు. అలాగే ఇటీవల ఫలితాలు వెలువడైన పదో తరగతి, ఇంటర్‌లలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సత్కరించారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు చింత మురళి, మాజీ ఎంపీపీ జి.వసంత రావు, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

నందిగాం, మే 18(ఆంధ్రజ్యోతి): సవర రామకృష్ణాపురంలో వేంచేసియున్న కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం మంగళవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం విశేష పూజలు అనంతరం అన్నపూర్ణాదేవి సమేత కాశీ విశ్వేశ్వర స్వామికి కల్యాణం నిర్వహించనున్నామన్నారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ, సాయంత్రం స్వామి తిరువీధి నిర్వహిస్తున్నామని, భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకోవాలని వారు ఒక ప్రకటనలో కోరారు.

నేడు మినీ మహానాడు

పాతపట్నం, మే 19(ఆంధ్రజ్యోతి): పాతపట్నంలో మంగళవారం నిర్వహించనున్న మినీ మహానాడును విజయవంతం చేయాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. టీడీపీ వ్యవస్థాపకుడు, దివంగత సీఎం ఎన్టీఆర్ జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ఐదు మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

ఏఐవైఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా యుగంధర్

టెక్కలి, మే 19(ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్ (ఏఐవైఎఫ్) జాతీయ కార్యవర్గ సభ్యుడిగా టెక్కలి మండలం ధర్మనీలాపురానికి చెందిన మొజ్జాడ యుగంధర్ ఎన్నిక య్యారు. ఈనెల 15 నుంచి 18 వరకు తిరుపతిలో జరిగిన ఏఐవైఎఫ్ జాతీయ మహాసభల్లో యగంధర్‌ను ఎన్నుకున్నారు. ఈయన ఇప్పటికే సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

పోక్సో చట్టం కింద కేసు నమోదు

హిరమండలం, మే 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన 15 ఏళ్ల బాలికపై అదే గ్రామానికిచెందిన వ్యక్తి లైంగిక దాడి చేసినట్లు బాధితురాలి తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎండీ యాసిన్ తెలిపారు. ప్రేమ పేరుతో నమ్మించి మోసం చేశారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. పూర్తిస్థాయిలో విచారణ చేపడతామని పేర్కొన్నారు.

కాలువలను అభివృద్ధి చేయాలి

నరసన్నపేట, మే 19(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రతి ఎకరాకూ సాగునీరందించేలా కాలువలను అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. సోమవారం స్థానిక ఆర్‌అండ్‌బీ భవనంలో ఇరిగేషన్, వంశధార అధికారులతో సమీక్షించారు. నరసన్నపేట, పోలాకి, జలుమూరు మండలాల్లో దాదాపు 80 శాతం వంశధార కాలువలపై ఆధారపడి వ్యవసాయ సాగుతోందని, సారవకోట మండలంలో చెరువులు, ఇతర మార్గాలతో వ్యవసాయానికి నీరందే అవకాశం ఉందని, శివారు ప్రాంతాలకు సాగునీరందేలా ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. షట్టర్లు లేని ప్రాంతాల్లో తాత్కాలిక ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో వంశధార ఈఈ ప్రదీప్, ఇరిగేషన్ ఏఈ శిమ్మ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పిడుగులపై అప్రమత్తంగా ఉండాలి

టెక్కలి, మే 19(ఆంధ్రజ్యోతి): ఆరుబయట గొర్రెలు, మేకలను మేపుతున్నప్పుడు పిడుగు పడే సమయాల్లో సంబంధిత పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జయరాజ్ అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో గొర్రెలు, మేకల పెంపకందారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. పిడుగులు పడే సమయంలో చెట్ల కింద, సెల్‌టవర్లు, విద్యుత్ స్తంభాలు, చెరువులు, ఇనుప కంచెల వద్ద ఉండవద్దన్నారు. పక్కా భవనాల్లో తలదాచుకేనేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఏడీ డాక్టర్ రఘునాథ్, పశు వైద్యులు పూర్ణచంద్రరావు, చక్రవర్తి, యాదవ సంఘం డైరెక్టర్ ఇప్పిలి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరుబయట ఉండొద్దు

పాతపట్నం, మే 19 (ఆంధ్రజ్యోతి) ఉరుములు, మెరుపులు వచ్చే సమయాల్లో పిడుగులు పడే అవకాశం ఉన్నందున ఆరుబయట ఉండవద్దని మండల ప్రత్యేకాధికారి డాక్టర్ మంచు కరుణాకర్, తహసీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్ సూచించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో గొర్రెలు, మేకల పెంపకందారులు, పాడి రైతులకు ప్రకృతి వైపరీత్యాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఎస్ఐ బి.లావణ్య, ఎంపీడీవో పి.చంద్ర కుమారి, పశు వైద్యులు పి.అనిల్‌కుమార్, శ్రీవాణి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

ముందు జాగ్రత్తలతో ప్రమాదాల నివారణ

ఎల్.ఎన్.పేట, మే 19(ఆంధ్రజ్యోతి): విపత్తుల సమయంలో ముందు జాగ్రత్తలతో ప్రమా దాలను నివారించవచ్చని కొత్తూరు డివిజన్ పశు సంవర్ధక శాఖ ఏడీ జి. నారాయణరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులు, వెటర్నరీ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో పి.శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ శ్రీనివాసులు, పశువైద్యాధికారి జి.కవిత తదితరులు పాల్గొన్నారు.

విపత్తుల నివారణపై అవగాహన

జలుమూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాల నుంచి ప్రాణాలు కాపాడుకునేందుకు ఆ సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ జె.రామారావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పశువైద్యాధికారులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. విపత్తులు సంభవించినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగించాలన్నారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున తగు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఎంపీడీవో కె.అప్పలనాయుడు, ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరరావు, పశు వైద్యాధికారులు ముద్దాడ దీప్తి, పట్ట సంతోష్, నారాయణ, వ్యవసాయాధికారి కె.సురేష్, సచివాలయ సిబ్బంది, పలువురు పశువైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఐదు రోజులు జాగ్రత్తగా ఉండాలి

పోలాకి, మే 19(ఆంధ్రజ్యోతి): రానున్న ఐదు రోజులు భారీ వర్షాలు, ఉరుములు, మెరుపులు, పిడుగుల పడే అవకాశం ఉన్నందున అందరూ అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ రవికుమార్ అన్నారు. సోమవారం వివిధ పంచాయతీల గొర్రెలు, మేకల పెంపకందారులు, పశు వైద్యాధికారులు. సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రమాదం సంభవించిన వెంటనే తెలియచేయాలన్నారు. పశువైద్యసేవలు సరిగా అందడంలేదని గొర్రెల కాపర్లు అధికారులకు ఫిర్యాదుచేయగా ఎంపీడీవో స్పందించి సేవలందించని, గైర్హాజరయ్యే వైద్యుల వివరాలు ఇవ్వాలన్నారు. సమావేశంలో పలుశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పిడుగుల బారినుంచి రక్షించుకోవాలి

నందిగాం, మే 18(ఆంధ్రజ్యోతి): వాతావరణంలో సంభవిస్తున్న మార్పులతో తరచూ పిడుగులు పడుతున్నందున గొర్రెలు, మేకలను పిడుగుల నుంచి రక్షించుకోవాలని పశు సంవర్ధక శాఖ ఏడీ ఎం.రవికృష్ణ సూచించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.సోమేశ్వరరావు, ఎంపీడీవో కుమార్ పట్నాయక్ మాట్లాడుతూ.. పిడుగుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ చెట్లు, పొలాల్లో ఉండవద్దన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ టి.రాజారావు, పశువైద్యాధికారి జి.మన్మథరావు, సర్పంచ్ ఎస్.జానకిరాం, వీఆర్వోలు, కార్యదర్శులు పాల్గొన్నారు.